epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 59 | శుక్రవారం | 28.06.2024



# వానొచ్చెనంటే.. వరదొస్తది..

- చిన్న పాటి వర్షా నికే జలమయమైన జనగామ
- జిల్లాలో ఓ మోస్తరు వర్షం
- లింగాలఘణపురంలో 8 మి.మీ వర్షపాతం

2

---



## మహిళా అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- 'మహిళా శక్తి'లో జిల్లాను ఆదర్శంగా నిలపాలి
- జనగామ కలెక్టర్ రిజ్వన్ బాషా షేక్

3

## టీ 20లో ఫైనల్‌కు చేరిన ఇండియా

- సెమీస్‌లో ఇంగ్లాండ్‌కు 172 టార్గెట్
- 103 పరుగులకే ఆలౌట్
- రేపు దక్షిణాఫ్రికాతో ఫైనల్

5



General News



# వానొచ్చెనంటే వరదొస్తది..!

- చిన్నపాటి వర్షా నికే జలమయమైన జనగామ పట్టణం
- జిల్లాలో ఓ మోస్తరు వర్షం
- లింగాలఘణపురంలో 8 మి.మీ వర్షపాతం

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** 'వానొచ్చెనంటే వరదొస్తది..' అన్నట్టు తయారైంది జిల్లా కేంద్రమైన జనగామ పరిస్థితి. గురువారం కురిసిన చిన్న పాటి వర్షానికేని పట్టణంలో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని హైదరాబాద్-హనుమకొండ రోడ్డుపై మురుగు నీరు ఏరులై పారింది. దీంతో ప్రయాణికులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంట వరకు కురిసిన వర్ష పాతం ఈ విధంగా ఉంది. జిల్లాలోని లింగాలఘణపురం మండలంలో అత్యధికంగా 8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నర్మెట 5 మి.మీ, తరిగొప్పుల మండలం



అబ్దుల్‌నాగారంలో 4.5 మి.మీ, జనగామ మండలం వడ్లకొండలో 4 మి.మీ, పాలకుర్తి మండలం వావిలాలలో 2 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 1.3 మి.మీ, చిల్పూర్ మండలం మలక్కాపూర్‌లో ఒక మిల్లీమీటర్ వర్షపాతం నమోదైంది.











## సోమేశ్వర ఆలయంలో జనగామ డీఎఫ్‌వో పూజలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం జనగామ జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చేప పిల్లలకు బదులు నగదు జమ చేయాలి

- ఎమ్మెల్యేకు మత్స్యకారుల వినతి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరస్తా:** మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలకు పంపిణీకి బదులు సొసైటీలకు నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగల రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ రూ.200 కోట్లు ఉచిత చేప పిల్లల పథకానికి కేటాయించాలని, ప్రతి సొసైటీ జల వనరులకు సరిపడే నాణ్యమైన చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేయాలని కోరారు. పంపిణీలో తేడా వస్తే ఆ సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి తక్షణమే మంత్రిని నియమించి రెగ్యులర్ కమిషనర్‌ను కేటాయించాలని, వచ్చే బడ్జెట్ రూ.5000 కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని కోరారు. ప్రతి మత్స్యకార సొసైటికి రూ.10 లక్షలు, మహిళా మత్స్య సొసైటికి 5 లక్షల రూపాయలు చొప్పున ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఎన్సీడీసీ, ఎన్ఎఫ్‌డీబీ ద్వారా ఋణాలు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా అమలు చేయాలని, ప్రతి జిల్లాకు చేప, రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్య కారులందరికి రూ.5 వేల వృద్ధాప్యాన్ని ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో చేపలు చనిపోతే బీమా, ఎక్స్‌గ్రేషియా అమలు చేసి నష్ట పరిహారంతో పాటు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఆయన వెంట మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిమ్మల విజేందర్, గొడుగు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి భిక్షపతి, సహాయ కార్యదర్శి నీరటి చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు కండ్లకొల్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.



Local News



# మహిళల అభివృద్ధి కోసమే.. 'మహిళా శక్తి'

- తయారీ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని తీసుకొచ్చిందని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అన్ని మండలాల సీసీలు, ఏపీఎంలు, వీఓలకు మహిళా శక్తి పథకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు జీవనోపాధి కల్పించాలని, వారిని మరింత ఎక్కువగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 మండలాల వారీగా 466 మంది వీఓలు, 11,201 స్వయం సహాయక సంఘాలు, 1,25,716 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని వివరించారు. జిల్లాలో ఈ సంఘాల ద్వారా మహిళలకు లక్ష్యానికి మించి ఉపాధిని కల్పించాలని సూచించారు. ఇప్పటివరకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పనలో అభివృద్ధి సాధించిన సీసీలు, వీఓలను కలెక్టర్ అభినందించారు. ప్రధానంగా ఏ లబ్ధిదారులైనా మహిళా సంఘంలో తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలన్నారు. ఏ పథకంలో అయినా సరే బ్యాంక్ లింకేజ్ ద్వారానే రుణాలు మంజూరు అవుతాయన్నారు. మైక్రో ఎంటర్ ప్రైస్ యూనిట్ల ఏర్పాటు కింద ప్రతి ఒక్క వీఓ లక్ష్యాల వారీగా 25 మందిని గుర్తించి, మూడు రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అలాగే స్వయం సహాయక సంఘాల అకౌంటింగ్ యాప్ లోనూ సంబంధిత పూర్తివివరాలను నమోదు చేయాలని సూచించారు. దీనికి రూ. 2 లక్షల వరకు రుణం అందించనున్నట్లు తెలిపారు. పెరటికోళ్ల పెంపకానికి రూ.3 లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. పాడి, పశు పోషణ, సంరక్షణ కింద రూ.50 వేల వరకు రుణం ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే మీసేవా కేంద్రాల ఏర్పాటుకు ఇంటర్మీడియెట్ పాస్ అయ్యి ఉండాలని, 18 సంవత్సరాల వయసు నిండి ఉండాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ కింద బ్యాంకులో 35 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహిళా శక్తి పథకం కింద సంగం లో లేని 1800 మంది మహిళలను లక్ష్యాల వారీగా స్వయం సహాయక సంఘాల్లో చేర్చాలని తెలిపారు. అంతకుముందు మహిళా శక్తి పథకంపై సీసీలు, వీఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్డీఓ మొగులప్ప, డీవీహెచ్ఓ ఎస్ఎల్ మనోహర్, ఏపీడీ శ్రీనివాస రావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, డీపీఎంలు పాల్గొన్నారు.



## పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్ రికార్లను, పరిసరాలను పరిశీలించారు. అక్కడి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై డీసీపీకి వివరించారు. అనంతరం ఆయన అధికారులకు పలు సూచనలు చేస్తూ ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి శ్రమదాన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎవరి వర్టికల్‌లో వారు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్సైకి, సిబ్బందికి సూచించారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలని, సస్పెక్ట్‌లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజు, యాదగిరి, నర్సిరెడ్డి, రాకేష్, జమాల్, అనిల్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై మహిళాలకు అవగాహన

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** బచ్చన్నపేట మండలంలోని మహిళా సంఘాల అధ్యక్షులు సమావేశంలో సైబర్ సెక్యూరిటీ, సైబర్ జ్ఞాన్ పై అవగాహన కల్పించారు. డిజిటల్ సేవా, కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు రాపెల్లి జ్యోతి వెంకటేష్ టెక్నాలజీ జీవితంలో ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు అన్ని స్థాయిల్లో ఎలా వినియోగిస్తున్నారో వివరించారు. పేపర్ లెస్, నగదు లేకుండా వ్యాపార లావాదేవీలు చేస్తున్నామన్నారు. అలాగే సోషల్ మీడియా సామాజిక మాధ్యమాలను ఉపయోగించి జీవితంలో అవి కూడా ఒక భాగమైపోయి ఉన్నాయి. ఈ తరుణంలో సామాజిక మాధ్యమాన్ని హ్యాకింగ్ చేసి కొంతమంది మన రహస్యాలను దొంగిలిస్తున్నారన్నారు. వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించాలరు. కార్యక్రమంలో ఏపీఎం నాగేశ్వరరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, మండల సమైక్య పాలకవర్గం ఎం.శాంతి, లత, గ్రామ సంఘాల సమైక్య సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



## మండల ప్రత్యేక సమావేశం నిర్వహించాలి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరస్తా :** చిల్పూర్ మండల పరిషత్ నిధులపై వెంటనే ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జనగామ జిల్లా చిల్పూర్ మండలం వెంకటాద్రిపేట, వెంకటేశ్వర్లపల్లి ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సర్వసభ సమావేశంలో నాలుగున్నర సంవత్సరాలుగా వచ్చిన నిధుల వివరాలు, ఖర్చుల వివరాలు అడిగితే 15 రోజుల్లో ఇస్తామని 2 నెలలు గడిచినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాలుగు రోజుల్లో ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి కావస్తున్న 2023-24లో వచ్చిన నిధులు ఎన్ని ఏ గ్రామానికి ఎంత కేటాయించారనే విషయాన్ని అధికారులు చెప్పలేదన్నారు. రూ.20 లక్షలు మండల పరిషత్తులో ఉన్నప్పటికీ గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేయలేని పరిస్థితి అధికారులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ఆర్ఐ వెంకట్రెడ్డి పై జడ్చర్ల ఎమ్మెల్యే అనురుదు రెడ్డి చేసిన అనుచిత వాక్యాలను ఖండిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటేడ్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. గురువారం తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటేడ్ అసోషియేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటేడ్ అసోషియేషన్ బచ్చన్నపేట రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దారు విశాలక్షికి వినతిపత్రం అందించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలనగర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ గా విధుల నిర్వహిస్తున్న వెంకట్ రెడ్డిని ఈ నెల 23న జడ్చర్ల ఎమ్మెల్యే అనురుదు రెడ్డి చేసిన అనుచిత వాక్యాలను చేసి ఉన్నత అధికారులకు ఫిర్యాదు ఇచ్చి సస్పెండ్ చేయించడం సరికాదన్నారు. కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో అన్నదానం

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణానికి చెందిన బొక్కల బాలస్వామి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య బొక్కలు అన్నపూర్ణ, కూతుర్లు, కొడుకు ప్రసన్న, పావని, ప్రణయ్ కుమార్ జనగామలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో బొక్కల బాలస్వామి కుటుంబ సభ్యులు గత ఐదు సంవత్సరాలుగా పాలుపంచుకుంటున్నారన్నారు. సందర్భం ఉన్నప్పుడల్లా అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు, యువత, ప్రతి ఒక్కరూ సందర్భం ఏదైనా కానీ సమాజంలో జీవిస్తున్న నిరాశ్రయులు, అనాథలు, వృద్ధులకు అండగా నిలవాలని, అంతరించిపోతున్న మానవత్వాన్ని బతికించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కొయ్యాడ రవి, పండుగ నరేష్, బింగి నరసింహులు, ఎర్రవెల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



# ‘కల్కి’కి నో రెమ్యునరేషన్

## ఫ్రీగా నటించిన మృణాళ్ ఠాకూర్

**మన చౌరాస్తా, సినిమా :** పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా గురువారం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటించింది. అలాగే బిగ్ బీ అమితాబ్ బచ్చన్, లోక నాయకుడు కమల్ హాసన్, దిశా పటానీ, శోభన, రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం తదితరులు ప్రధాన పాత్రల్లో మెరిశారు. వీరితో పాటు విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ గోపాల్ వర్మ, మృణాళ్ ఠాకూర్ తదితరులు క్యామియో రోల్స్ పోషించారు. కల్కి 2898 ఏడీలో గినియా అనే పాత్రలో మృణాల్ ఠాకూర్ కనిపించింది. సినిమా ఆరంభంలోనే మృణాల్ క్యారెక్టర్ ఎంట్రీ ఇస్తుంది. కాగా కల్కిలో గెస్ట్ రోల్ కోసం మృణాల్ ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోలేదని సమాచారం. ఇందుకు ప్రత్యేక కారణముందట. సీతారామంతో తనకు తెలుగులో బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అభిమానంతోనే మృణాల్ కల్కి సినిమాలో ఫ్రీగా నటించిందట.




# ఫైనల్‌కు చేరిన భారత్

- సెమీస్‌లో ఇంగ్లాండ్‌కు 172 టార్గెట్
- 103 పరుగులకే ఆలౌంట్
- రేపు దక్షిణాఫ్రికాతో ఫైనల్ మ్యాచ్

**మన చౌరాస్తా, క్రీడావిభాగం :** టీ 20 ప్రపంచకప్ 2024లో టీమిండియా ఫైనల్స్ చేరింది. గురువారం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఈ ఫీట్ సాధించింది. గత టీ 20 ప్రపంచకప్ సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఓడిన టీమిండియా ఈసారి బదులు తీర్చుకుంది. బ్యాట్ తో, బంతితో రాణించి 68 పరుగుల తేడాతో ఆ జట్టును చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసి 171/7 పరుగులు చేసిన భారత్.. అనంతరం ఇంగ్లాండ్‌ను 103 పరుగులకే కుప్పకూల్చింది.

172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. తొలి మూడు ఓవర్లలో 26/0తో నిలిచి గత ప్రపంచకప్ నాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసింది. అయితే ఈ దశలో భారత బౌలర్లు సంచలన ప్రదర్శన చేశారు. తన స్పెల్‌లో తొలి బంతికే ప్రమాదకర జాస్ బట్లర్ (23)ను ఔట్ చేసిన అక్షర్ పటేల్ టీమిండియా బ్రేక్ త్రూ అందించాడు. ఆ తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా వేసిన అద్భుతమైన బంతికి ఫిలిప్ సాల్ట్ ఫ్యూజులు.. వికెట్లపై బెయిల్స్ ఎగిరిపోయాయి. అదే జోష్‌లో మొయిన్ అలీ (8), జానీ బెయిర్ స్టో (0)ను ఔట్ చేసిన అక్షర్ ప్రత్యర్థి బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు.

ఆ తర్వాత ఎంట్రీ ఇచ్చిన కుల్‌దీప్ యాదవ్.. మిగతా బ్యాటర్ల పని పట్టాడు. దీంతో హ్యారీ బ్రూక్ (25), సామ్ కర్రన్ (2), లివింగ్ స్టోన్ (11) సైతం పెవిలియన్ చేరిపోయారు. దీంతో టీమిండియా విజయం ఖరారైంది. చివరకు 16.4 ఓవర్లలో ఇంగ్లాండ్ ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, అక్షర్ పటేల్ 3, జస్‌ప్రీత్ బుమ్రా 2 వికెట్లు తీశారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 171/7 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ 39 బంతుల్లో 57 రన్స్‌తో జట్టు మెరుగైన స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. సూర్యకుమార్ యాదవ్ 36 బంతుల్లో 47 రన్స్, చివర్లో రవీంద్ర జడేజా (9 బంతుల్లో 17), అక్షర్ పటేల్ (6 బంతుల్లో 10 రన్స్) బ్యాటు ఝుళిపించారు. ఈ మ్యాచ్ ఫలితంతో టీమిండియా ఫైనల్ చేరింది. తొలి సెమీఫైనల్‌లో అఫ్ఘానిస్థాన్‌ను ఓడించిన దక్షిణాఫ్రికాతో భారత్.. టైటిల్ కోసం తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారం రాత్రి 8 గంటలకు జరగనుంది.






